

సోమశిలలో 36.355 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం 36.355 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 696 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.64,080
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,755
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,928
నవర (8 గ్రాములు)	రూ.47,424

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.0 /22.9

మంగళవారం గాలిలో తేమ 68 శాతం ఉంది. ఉష్ణోగ్రత సాధారణ స్థితికి చేరుకుంది. బుధవారం వాతావరణంలో పెద్ద మార్పులేవీ ఉండకపోవచ్చని ఆ శాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం



పీర్ల పార్థసారథి



పాలకీర్తి రవి



మొయిళ్ల గౌరి



లక్కు స్వరాజ్



శ్రావణ్

నెల్లూరు (దర్గామిట్ట): జిల్లాలోని వివిధ అనుబంధ విభాగాలకు కార్యవర్గాలను వైఎస్సార్‌సీపీ ప్రకటించింది. బీసీ సెల్ విభాగం అధ్యక్షుడిగా జాజుల కోటేశ్వరరావు, యువజన విభాగం అధ్యక్షుడిగా మంగలపూడి శ్రీకాంత్‌రెడ్డి, క్రిస్టియన్ మైనారిటీకి లక్కు స్వరాజ్, కల్చరల్ విభాగానికి నెల్లూరు నారాయణబాబు, ఐటీ విభాగానికి కొప్పోలు వెంకటేశ్వర్లు, మహిళా విభాగానికి అధ్యక్షురాలిగా మొయిళ్ల గౌరి, మైనారిటీ విభాగానికి షేక్ సిద్ధిఖ్, పంచాయతీ రాజ్‌కు బులగాకుల అనిల్‌కుమార్‌రెడ్డి, ఎస్టీ విభాగానికి పాలకీర్తి రవి, ప్రచార విభాగానికి పాలవెల్లి మాలకొండారెడ్డి, రైతు విభాగానికి సూరా శ్రీనివాసులురెడ్డి, ఎస్సీ విభాగానికి పందిటి కామరాజు, విద్యార్థి విభాగానికి గొల్లపూడి ప్రసన్న శ్రావణ్‌కుమార్, వాణిజ్య విభాగానికి కనమర్లపూడి వెంకట నారాయణ, దివ్యాంగుల కమిటీకి బుచ్చింగారి పోలయ్య, చేనేత విభాగానికి మన్నెం సుధాకర్, వైఎస్సార్ సేవాదళ్‌కు పీర్ల పార్థసారథి, వైఎస్సార్‌ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడిగా నడవాడి ముత్యంగౌడ్ నియమితులయ్యారు.

ఏపీఎస్ ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్‌పర్సన్‌గా సుప్రజ



బత్తుల సుప్రజ

సింగరాయకొండ: ఏపీఎస్ ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్‌పర్సన్‌గా బత్తుల సుప్రజను కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్టీసీ అభివృద్ధికి ఆమె చేసిన సేవలను గుర్తించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పదవిలో తిరిగి కొనసాగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. కాగా తన సేవలను గుర్తించి పదవిలో కొనసాగించిన సీఎం వైఎస్ జగన్‌కు, అందుకు సహకరించిన రాజ్యసభ ఎంపీ, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డికి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

కందుకూరు సబ్‌కలెక్టర్‌గా విద్యాధరి



విద్యాధరి

కందుకూరు: కందుకూరు సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తున్న శోభికను ప్రభుత్వం బదిలీ చేసింది. ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా శోభికను ఇక్కడి నుంచి బదిలీ చేసి మధ్యాహ్న భోజన స్పెషల్ ఆఫీసర్‌గా నియమించారు. కందుకూరు నూతన సబ్‌కలెక్టర్‌గా గొబ్బిల విద్యాధరిని నియమించారు. 2021 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన విద్యాధరి ప్రస్తుతం శిక్షణ పూర్తి చేసుకున్నారు. మొదటి పోస్టింగ్‌గా ఇక్కడ నియమితులయ్యారు. ఈమె వైఎస్సార్ జిల్లా నందలూరు మండలం గొల్లపల్లె గ్రామానికి చెందిన వారు.

తీరిన సాగునీటి బెంగ



సోమశిల జలాశయం నుంచి ఉత్తర, దక్షిణ కాలువలకు సాగునీరు

- వ్యవసాయ పనుల్లో ముమ్మరంగా రైతులు
- విస్తృతంగా సాగుతున్న వరినాట్లు
- నీటిని వృథా కానివ్వొద్దు: ఇరిగేషన్ ఈఈ

మొన్నటి వరకు నీటి చుక్క కోసం ఆకాశం వైపు ఆశగా చూసి అలసిపోయిన మెట్ట ప్రాంత రైతులు... సోమశిల జలాశయం నుంచి నీరు విడుదల కావడంతో సేద్య పనుల్లో బిజీగా మారిపోయారు. దుక్కి దున్నడం, నార్లు పోసుకోవడమే కాకుండా కొన్నిచోట్ల వరినాట్లు కూడా వేగంగా సాగుతున్నాయి. సోమశిల ఆయకట్టు భూములు మెల్లగా పచ్చదనం పరుచుకుంటున్నాయి.



నీటి లభ్యతతో ముమ్మరంగా సాగుతున్న వరినాట్లు

ఆత్మకూరు: ఈ ఏడాది మెట్ట ప్రాంతంలో పంటలకు సాగునీరు అందుతుందో లేదోనని ఆందోళన చెందిన రైతులు ఎట్టకేలకు సోమశిల నీరు అందడంతో వరినాట్లు వేసుకుంటున్నారు. వాస్తవానికి ఈ ఏడాది వర్షాలు తక్కువ కావడంతో ఆశించిన మేర సాగునీరు లభ్యంకాని పరిస్థితి. సాధారణంగా నవంబరు మాసంలో సోమశిల జలాశయంలో కనీసం 40 టీఎంసీలకుపైగా నీరు ఉండేది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కేవలం 20 టీఎంసీలకే పరిమితమైంది. ఈ నేపథ్యంలో రెండు వారాల క్రితం జిల్లాలోను, ఎగువ ప్రాంతంలోను కురిసిన భారీ వర్షాలతో జలాశయంలో నీటి లభ్యత పెరిగింది. దీనికితోడు మిచాంగ్ తుఫాన్‌తో ఆరు టీఎంసీల నీరు అదనంగా చేరి ప్రస్తుతం జలాశయంలో 36 టీఎంసీలకుపైగా నీరు అందుబాటులో ఉంది. వీటిలో డెడ్ స్టోరేజ్, తాగునీరు పోగా మిగిలిన నీరు కొంత కండలేరుకు కేటాయించగా సాగునీటి కోసం తొలుత పెన్నా డెల్టాకు, తదుపరి మెట్ట ప్రాంత కాలువలైన ఉత్తర, దక్షిణ కాలువలకు సాగునీరు విడుదల చేసేలా జిల్లా సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశంలో నిర్ణయించారు. ఆ మేరకు గత వారం కలెక్టర్ అనుమతులతో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి చేతుల మీదుగా ఉత్తర, దక్షిణ కాలువలకు జలాశయం నుంచి నీరు విడుదల చేశారు. పుష్కలంగా నీరులేని పరిస్థితుల్లో మూడు టీఎంసీలు ఉత్తర కాలువకు, 1.8 టీఎంసీలు దక్షిణ కాలువకు కేటాయించారు. ఉత్తర కాలువ ద్వారా మెట్ట పంటలకు సాగునీరు అందిస్తూ ఏఎస్‌పేట మండలం మీదుగా రాళ్లపాడు జలాశయం వరకు నీరు పారించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. దక్షిణ కాలువ ద్వారా కొంత వరకే నీరు విడుదల చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

రైతుల ఆనందం

సాగునీటి లభ్యత ఈ ఏడాది ఉండదేమోనని బెంగపడిన రైతులు ఇటీవల కురిసిన వర్షాలతో నీటి నిల్వ పెరగడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నీటి విడుదలతో పలువురు రైతులు ఇప్పటికే సేద్యం పనులు పూర్తి చేసుకుని విత్తనాలు చల్లుతున్నారు. బోర్లు, బావుల కింద కొంత మేర నీటి లభ్యత ఉన్న మరికొందరు రైతులు నారు పెంచుకొని వరినాట్లు పనుల్లో ముమ్మరంగా ఉన్నారు.

60 వేల ఎకరాలకు సాగునీరు

సోమశిల జలాశయం నుంచి ఉత్తర, దక్షిణ కాలువల ద్వారా సాగునీటిని విడుదల చేయడంతో ఆత్మకూరు, మర్రిపాడు, ఏఎస్‌పేట, అనంతసాగరం, చేజర్ల, పొదలకూరు (ఎగువ ప్రాంతం) కలువాయి మండలాల పరిధిలో సుమారు 60 వేల ఎకరాలు సాగు కానుంది. ఇప్పటికే ఆర్‌బీకేల ద్వారా రైతులకు సబ్సిడీపై విత్తనాలు ప్రభుత్వం సరఫరా చేస్తోంది.



బటన్ నొక్కి జలాశయం నుంచి కాలువలకు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి (ఫైల్)

నీటి వినియోగాన్ని పర్యవేక్షిస్తాం

జలాశయం నుంచి ఉత్తర కాలువకు మూడు టీఎంసీల నీరు విడుదల చేస్తాం. కాలువ పరిధిలో వృథా కాకుండా సాగునీరు సద్వినియోగం అయ్యేలా సిబ్బందితో పర్యవేక్షణ చేస్తాం. ఇప్పటికే కొన్ని గ్రామాల పరిధిలోని చెరువులలో నీరు ఉంది. ఉత్తర కాలువ ద్వారా సరఫరా అయ్యే నీరును అవసరమయ్యే పొలాలకు రైతులు మళ్లించుకోవాలి. రైతులకు నీటి వినియోగంపై అవగాహన కూడా కల్పిస్తున్నాం.

– ఆర్ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఈఈ, ఆత్మకూరు

పేదలకు ఉచిత న్యాయ సేవలు

- సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి

వెంకటాచలం: జైలు జీవితం గడిపి బయటకు వచ్చిన వ్యక్తులు సత్‌ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.వాణి సూచించారు. మండలంలోని చెముడుగుంట వద్ద నున్న కేంద్ర కారాగారంలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న ఖైదీల యోగ, క్షేమాలను సీనియర్ సివిల్ జడ్జి అడిగి తెలుసుకున్నారు. వసతులు సక్రమంగా ఉన్నాయా లేదానని పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడారు. వెనుకబడిన వర్గాలకు, నిరక్షరాస్యులకు, అంగవైకల్యం ఉన్న వ్యక్తులకు ఉచిత న్యాయం అందించాలనే ఆలోచనతో ప్రభుత్వం 1987లో న్యాయసేవాధికార సంస్థల చట్టాన్ని రూపొందించి, తద్వారా న్యాయ సేవలు అందిస్తోందని తెలియజేశారు. క్షణికావేశాలతో నేరం చేసి జైలు జీవితం అనుభవించిన తర్వాత కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా జీవించాలని సూచించారు. న్యాయ సేవలు అవసరం ఉన్న వారికి లాయర్‌ను ఏర్పాటు చేసి ఉచితంగా సేవలందిస్తామని తెలియజేశారు. ఈ సదస్సులో జైలు సూపరింటెండెంట్ కె.రాజేశ్వరరావు, జైలర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఎవరినీ వదిలిపెట్టను

- నా మీద ఏమన్నా ఉంటే తేల్చుకోండి
- భవిష్యత్ ఉన్న బిడ్డలపై ఇలా చేస్తారా
- దీని వెనుక ఎవరున్నారో? ఫొటోలు ఎవరు పంపారో నాకు తెలుసు
- న్యాయ పోరాటానికి సిద్ధంగా ఉన్నా
- విలేకరులతో నుడా మాజీ చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న ముక్కాల ద్వారకానాథ్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నా మీద ఉన్న ఈర్ష్య, అక్కసుతో నా బిడ్డను టార్గెట్ చేశారు. ఎవరినీ వదిలిపెట్టేది లేదని నుడా (నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) మాజీ చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ హెచ్చరించారు. నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన తన కుమారుడు ప్రేమ్‌తో కలిసి మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హైదరాబాదులో డ్రగ్స్ కేసులో నా కుమారుడిని, అతని స్నేహితుల్ని అరెస్ట్ చేశారని వచ్చిన వార్తలు నిజం కాదు. నా బిడ్డ నాతోనే ఉన్నాడు, కారు కూడా నెల్లూరులోనే ఉంది. పుట్టినరోజు సందర్భంగా సరదాగా స్నేహితులతో కలిసి నా కుమారుడు హైదరాబాద్‌లోని సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో దిగాడు. పోలీసులు సాధారణ తనిఖీల్లో యువతని విచారణకి పిలిచారు. స్టేషన్‌లో అన్ని టెస్ట్‌లు చేశారు. శనివారం టెస్ట్‌లు ఇస్తే సోమవారం రమ్మన్నారు. రిపోర్టులు అన్నీ నెగటివ్ వచ్చాయి అని పోలీసులు పంపించేశారు. డ్రగ్స్ కేసులో నా కుమారుడు అరెస్టు అంటూ తప్పుడు ప్రచారం చేశారు. కడుపుకు కూడు తినే వాడు ఇలా చేయడు. మా కుటుంబం ఎప్పుడు ఇలాంటి అలవాట్లకు చాలా దూరంగా ఉంటుంది. ప్రత్యర్థులు ఇన్ని రోజులు నన్ను టార్గెట్ చేసినా సైలెంట్‌గా ఉన్నాను. నా బిడ్డల జోలికొచ్చారు కనుక ఇక సహించేది లేదు. టార్గెట్ చేసిన ప్రతి ఒక్కరినీ వదిలేది లేదు, వారి సంగతేమిటో తేలుస్తా అని ద్వారకానాథ్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. గుడ్డ కాల్చి నెత్తిమీద వేయడం దారుణం. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన ప్రతి ఒక్కరికీ లీగల్ నోటీసులు పంపుతానన్నారు.

‘వికసిత్’ యాత్రను విజయవంతం చేయండి

నెల్లూరు (పొగతోట): జిల్లాలోని ప్రతి గ్రామంలో జరుగుతున్న వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమానికి ఎక్కువ మంది ప్రజలు హాజరయ్యేలా చూడాలని జిల్లా ప్రధాన అధికారి వీవీకే బంగార్రాజు ఎంపీడీఓలకు సూచించారు. మంగళవారం ఆయన వికసిత్ భారత్ నోడల్ అధికారులతో వెబెక్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గ్రామాల్లో ఎంతమంది హాజరవుతున్నది పరిశీలిస్తున్నామని, సరాసరి 368 మంది ప్రజలు హాజరవుతున్నట్లు నివేదికలు ఉన్నాయన్నారు. జిల్లాలో కూడా ఎక్కువమంది హాజరై సంకల్ప్ తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో వివిధ రంగాల్లో నిష్ణాతులైన క్రీడాకారులు, కళాకారులు, సామాజిక సేవ చేసే వారిని గుర్తించి సత్కరించాలన్నారు. కార్యక్రమాలు జరిగే గ్రామాల్లో ముందుగానే టామ్ టామ్ ద్వారా ప్రజలకు తెలియజేయాలన్నారు. చేపట్టిన కార్యక్రమాలు పత్రికల్లో వచ్చే విధంగా చూడాలన్నారు. అధికారులతో పాటు బ్యాంకర్లు, గ్యాస్ ఏజెన్సీలు పాల్గొనే విధంగా చూడాలన్నారు. జిల్లా నోడల్ అధికారి డీఆర్‌డీఏ పీడీ సాంబశివరెడ్డి మాట్లాడుతూ టెలీకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కమిటీకి ఆదేశాలిస్తున్నామని, ఎంపీడీఓలు తమ మండలంలో జరిగే వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు హాజరు కావాలని, పొదుపు గ్రూపు సభ్యులు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

జెడ్పీలో సెమీ క్రిస్మస్ వేడుకలు



సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ తదితరులు

నెల్లూరు (పొగతోట): జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జెడ్పీ సీఈఓ చిరంజీవి ఆధర్వంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా కేక్ కటింగ్ చేశారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కాంటాక్ట్ ఉద్యోగులకు వస్త్రాలు అందచేశారు.

డిగ్రీ పరీక్షలకు 46 మంది గైర్హాజరు

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో మంగళవారం నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలకు 46 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్ ప్రభాకర్ తెలిపారు. మొత్తం 366 మంది విద్యార్థులకు గాను, 320 మంది హాజరై 46 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

సోమిరెడ్డి దీక్ష భగ్నం

పొదలకూరు: పొదలకూరు మండలం తాటిపర్తి పంచాయతీ రుస్తుం మైన్లో మూడు రోజులుగా టీడీపీ నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చేస్తున్న సత్యాగ్రహ దీక్షను మంగళవారం తెల్లవారు జామున పోలీసులు భగ్నం చేశారు. మైన్ వద్ద లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తుతుండడంతో పోలీసులు సోమిరెడ్డిని అక్కడి నుంచి బలవంతంగా తరలించి నెల్లూరు రూరల్ మండలం అల్లీపురంలోని ఆయన స్వగృహంలో వదిలి పెట్టారు.

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో..

గ్రూప్–1, గ్రూప్–2 ఉద్యోగ పరీక్షలపై

నేడు ఉచిత అవగాహన సదస్సు

- గెస్ట్ స్పీకర్‌గా సివిల్స్ విజేత బాలలత
- లక్ష్యం: గ్రామీణ, పట్టణ విద్యార్థులకు గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలపై అవగాహన కల్పించడం

సాక్షి ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 81 గ్రూప్–1, 897 గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో.. గ్రామీణ, పట్టణ విద్యార్థులను గ్రూప్–1, గ్రూప్–2 స్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్(www.sakshieducation.com) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉచిత అవగాహన సదస్సులను నిర్వహించనుంది. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికి తెల్సిందే.

గెస్ట్ స్పీకర్‌గా బాలలత :

ఎంతో మందిని పోటీ పరీక్షల్లో విజేతలుగా తీర్చిదిద్దుతున్న సివిల్స్ టాపర్ బాలలత గారు గ్రూప్1, గ్రూప్ 2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సుకు గెస్ట్ స్పీకర్‌గా హాజరుకానున్నారు. ఆమె గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలపై అవగాహన కల్పించడం తోపాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయనున్నారు.

ముఖ్య సమాచారం

అవగాహన సదస్సు తేదీ:
డిసెంబర్ 20, 2023 (బుధవారం)

వేదిక
దేవిశెట్టి స్వాములు రాజేశ్వరి కల్యాణ మండపం, ఆర్టీసీ బస్టాండ్ రోడ్, సోమశేఖరపురం, నెల్లూరు.

సమయం
ఉదయం 09:30 నుంచి 12:30 వరకు.

వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్ : 8179100598

వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే కొండంత బలం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

• ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): 'వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే కొండంత బలం. అందువల్లే వచ్చే ఎన్నికల్లో ఆత్మకూరు నియోజకవర్గంలో పోటీ చేసేందుకు ప్రతిపక్ష నాయకులు భయపడుతున్నారు.' అని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని మేకపాటి క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన నాయకులు, గ్రామ పంచాయతీ పరిశీలకులతో మంగళవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. మేకపాటి గౌతమ్‌రెడ్డి ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో ప్రతి గ్రామంలోని నాయకులు, కార్యకర్తలు తమ కుటుంబానికి అండగా ఉన్నారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం తన వంతుగా ప్రజలతో మమేకమై నియోజకవర్గ బహుముఖ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఒకటిన్నర సంవత్సరంలో తాను ఎమ్మెల్యేగా చేసిన, చేస్తున్న పలు కార్యక్రమాలను వివరించారు. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలతో ఆత్మకూరును అగ్రగామిగా నిలిపేందుకు తాను శాయశక్తులా కృషి చేస్తానన్నారు. గ్రామాల స్థాయిలో ప్రతి నాయకుడు, కార్యకర్త ఎన్నికల నోటిఫికేషన్ నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు సైనికుల్లా పనిచేసి జగనన్న ఆశయాలు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జేసీఎస్ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ పరిశీలకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు సాగునీరందిస్తాం

• కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

సంగం: కావలి కాలువ పరిధిలో ప్రతి ఎకరాకు సాగునీరందిస్తామని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. సంగం బ్యారేజ్ వద్ద నుంచి కావలి కాలువకు సాగునీటిని మంగళవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా అధికారులు, రైతులతో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రామిరెడ్డి మాట్లాడుతూ వర్షాలు కురవడంతో సోమశిల జలాశయానికి, పలు చెరువులకు నీరు చేరిందన్నారు. సాగునీరు పుష్కలంగా ఉండడంతో డెల్టాతోపాటు నాన్‌డెల్టాకు పంటలు పండించుకునే అవకాశం రావడం సంతోషకరంగా ఉందన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిల పాలనలో రైతులకు సాగునీటి కొరత లేదన్నారు. చంద్రబాబు హయాంలో కరువు విలయతాండవం చేసిన విషయం అందరికీ తెలుసునన్నారు. అన్నదాతలు సాగునీటిని వృథా చేయకుండా పంటలు పండించుకోవాలని సూచించారు. అడిగిన వెంటనే కావలి కాలువకు నీరందించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ హరినారాయణన్, ఇరిగేషన్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ సంగం మండల మాజీ కన్వీనర్ కంటాబత్తిన రఘునాథరెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి, నాయకులు

ఆరోగ్యశ్రీ పథకం పేదలకు సంజీవని



ఆరోగ్యశ్రీ కార్డులు అందుకున్న వారితో మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

• ఉదయగిరి సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి

దుత్తలూరు: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పేద ప్రజలకు సంజీవనిలా మారిందని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. నూతనంగా మంజూరైన ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు మంగళవారం దుత్తలూరు బిట్-1 సచివాలయంలో ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పథకానికి ప్రాణం పోసింది దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అయితే దానిని మరింత బలోపేతం చేసింది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రూ.25 లక్షల వరకు చికిత్స చేయించుకునేలా చర్యలు తీసుకోవడంతో పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎంత పెద్ద వ్యాధి అయినా ఉచితంగా వైద్యసేవలు పొందవచ్చన్నారు. దీనిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. విద్య, వైద్యం పట్ల జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ఎంతో శ్రద్ధ ఉందన్నారు. ప్రజలకు ఇంతగా మంచి చేస్తున్న ఆయన్ను 2024లో మళ్లీ సీఎంను చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లెక్కల లక్ష్మీకాంతమ్మ, ఎంపీడీఓ సాయిప్రసాద్, వైద్యాధికారి అయూబ్ అప్సర్, సర్పంచ్ యనమల సుబ్బమ్మ, సొసైటీ అధ్యక్షుడు తుమ్మల వెంగయ్య చౌదరి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ అన్నంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ దొంతిరెడ్డి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

వచ్చే నెల 2న పోలేరమ్మ గ్రామోత్సవం



చాటింపు వేస్తున్న దృశ్యం

అల్లూరు: ఎంతో ప్రసిద్ధి గాంచిన అల్లూరు ఊరు పోలేరమ్మ గ్రామోత్సవం జనవరి 2వ తేదీన నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మొదటి చాటింపును మంగళవారం నిర్వహించారు. రాత్రి ఆలయంలో ఆసాదులు ప్రత్యేక పూజలు నిర్వహించి చాటింపు వేశారు. ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో, గ్రామ ప్రజల సహకారంతో ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించాలని నిర్ణయించారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

నెల్లూరు(టౌన్): జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వినియోగదారుల క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు డీఈఓ గంగా భవాని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్‌లో కంజ్యూమర్ ప్రొటెక్షన్ ఇన్ ది ఎరా ఆఫ్ ఈ కామర్స్ అండ్ డిజిటల్ ట్రేడ్, తెలుగులో ఈ కామర్స్, డిజిటల్ వర్తకం శకంలో వినియోగదారుల రక్షణ అనే అంశాలపై ఈ పోటీలు ఉంటాయన్నారు. గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.1,500, ద్వితీయ బహుమతి రూ.1,000, తృతీయ బహుమతి రూ.750 ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇతర వివరాల కోసం నెల్లూరు డిప్యూటీ డీఈఓ ఫోన్ నంబర్ 80085 00675ను ఈనెల 20వ తేదీ లోపు సంప్రదించాలన్నారు.

సమగ్రశిక్షలో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు

నెల్లూరు(టౌన్): సమగ్రశిక్ష జిల్లా కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో ఫారిన్ సర్వీస్, డెప్యూటేషన్ పద్ధతిలో పనిచేసేందుకు ఆసక్తి గల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు (పాఠశాల విద్యాశాఖలో పనిచేస్తున్న వారు) నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏపీసీ ఉషారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఐఎస్ అండ్ ప్లానింగ్ కో-ఆర్డినేటర్, అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఉర్దూ), అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్, అసిస్టెంట్ ఐఈడీ కో-ఆర్డినేటర్ పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. ఈ ఏడాది అక్టోబర్ ఒకటో తేదీ నాటికి 50 ఏళ్లలోపు వయసున్న వారు దరఖాస్తులను సమగ్రశిక్ష కార్యాలయంలో ఈనెల 28వ తేదీలోపు సమర్పించాలన్నారు. అలాగే విద్యార్హత సర్టిఫికెట్లు, అనుభవం, ఇతర అన్ని ధ్రువీకరణపత్రాలను ఇవ్వాలని సూచించారు.

తీరంలో మృతదేహం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రాములు

గుడ్లూరు: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం తీరానికి కొట్టుకొచ్చింది. ఈ ఘటన మండలంలోని కర్లపాళెం – రామాయపట్నం పోర్టు మధ్యలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కర్లపాళేనికి చెందిన మత్స్యకారులు చేపల వేట నిమిత్తం రామాయపట్నం పోర్టు సమీపానికి వెళ్లారు. అక్కడ ఒడ్డున మృతదేహాన్ని చూసి వెంటనే గుడ్లూరు, రామాయపట్నం మెరైన్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రాములు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం ఉబ్బిపోయి గుర్తు పట్టలేని విధంగా ఉంది. వీఆర్వో సమక్షంలో శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బ్లాక్‌మెయిల్ చేయడం సోమిరెడ్డికి అలవాటే..

• వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటశేషయ్య



మాట్లాడుతున్న వెంకటశేషయ్య, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

నెల్లూరు(దర్గామిట్ట): బ్లాక్‌మెయిల్ చేసి రూ.కోట్లు దండుకోవడం టీడీపీ నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి అలవాటేనని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య అన్నారు. నెల్లూరు నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అక్రమ మైనింగ్ అంటూ హడావుడి చేయడం.. వారి నుంచి డబ్బు దండుకోవడం సోమిరెడ్డి పని అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నీతి, నిజాయితీతో ఉండే మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి అవినీతి మరకలు అంటించాలని సోమిరెడ్డి పన్నుతున్న కుయుక్తులను ప్రజలు నమ్మరన్నారు. ఇద్దరు వ్యక్తుల మధ్య మైనింగ్ వివాదం ఏర్పడితే సోమిరెడ్డి అందులో తలదూర్చి రాజకీయం చేయాలని ప్రయత్నిస్తున్నారన్నారు. అవినీతి బురదను తమకు అంటించాలని చూస్తున్నారని విమర్శించారు. సైదాపురంలో అక్రమ మైనింగ్ అంటూ హడావుడి చేసి రూ.5 కోట్లు, పొదలకూరు మండలం వరదాపురంలో మైనింగ్ గడువు ముగిసిపోయిన వ్యక్తి నుంచి మరో రూ.5 కోట్లు చంద్రమోహన్‌రెడ్డి దండుకున్నారని ఆరోపించారు. ఆయన అవినీతిపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని చర్చకు రావాలని సవాల్ విసిరారు. వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు తలమంచి సురేంద్రబాబు మాట్లాడుతూ సోమిరెడ్డి రాజకీయ జీవితం సర్వేపల్లిలో సమాధి అయిందన్నారు. సమావేశంలో రాష్ట్ర వన్నెకాపు కార్పొరేషన్ డైరెక్టర్ నెల్లూరు శివప్రసాద్, టీపీ గూడూరు మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి :	రూ.20
సన్నవి :	రూ.15
పండ్లు :	రూ.5

పౌల్ట్రీ ధరలు



బ్రాయిలర్ (లైవ్) :	113
లేయర్ (లైవ్) :	100
బ్రాయిలర్ చికెన్ :	204
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	226
లేయర్ చికెన్ :	170

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి

• ఆత్మకూరు ఆర్డీఓ మధులత



సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీఓ మధులత

ఆత్మకూరు: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో డివిజన్ పరిధిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని ఆత్మకూరు ఆర్డీఓ కె.మధులత ఆదేశించారు. డివిజన్ పరిధిలోని అన్ని మండలాల తహసీల్దార్లు, పోలీస్ అధికారులతో పట్టణంలోని తన కార్యాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత సాధారణ ఎన్నికలతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో చోటు చేసుకున్న సంఘటనలను దృష్టిలో ఉంచుకుని ఆయా పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నివేదిక ఇవ్వాలని తహసీల్దార్లను ఆదేశించారు. సమస్యలు సృష్టించే వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి మండలాల అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించాలన్నారు. కేంద్రాల్లో ఏర్పాటు చేయాల్సిన మౌలిక వసతుల గురించి ఆదేశాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కొత్తగా ఓటర్లుగా నమోదయ్యే వారి వివరాలు క్షుణ్ణంగా పరిశీలించాలని, అదే క్రమంలో ఫారం-7 ద్వారా ఓట్ల తొలగింపును పరిశీలించిన అనంతరం నిర్ణయం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఓ సుభద్ర, ఎన్నికల డీటీ సుప్రభ, డీఎస్పీ ఎస్.కోటారెడ్డి, సీఐలు జి.వేణు, రవినాయక్, పలువురు ఎస్సైలు పాల్గొన్నారు.

లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కి..

• సెబ్ సీసీని పట్టుకున్న అధికారులు



ఫరూఖ్ అహ్మద్

ఒంగోలు సబర్బన్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ)లో పనిచేస్తున్న ఉద్యోగి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు మంగళవారం పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ వి.శ్రీనివాసరావు కథనం మేరకు.. ఒంగోలుకు చెందిన స్వర్ణ మల్లికార్జునరావు, శ్రీదేవి దంపతులు 2019లో కారు కొన్నారు. దానికి టంగుటూరు మండలం జమ్ములపాలేనికి చెందిన మెక్కన కుమార్‌ను డ్రైవర్‌గా పెట్టుకున్నారు. కొంతకాలం తర్వాత కుమార్ బంధువుల పెళ్లికి వెళ్లాలని మల్లికార్జునరావును కారు అడిగి తీసుకెళ్లాడు. కుమార్ ఇతర రాష్ట్రం నుంచి మద్యం తీసుకొచ్చి జమ్ములపాలెంలోని తన ఇంట్లో పెట్టుకుని అమ్ముతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న టంగుటూరు పోలీసులు అతడిని పట్టుకుని మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కుమార్, అతడి భార్యను అప్పట్లో అరెస్ట్ చేశారు. ఆ తర్వాత డ్రైవర్‌కు ఎస్ఈబీ కమిషనర్ రూ.60 వేల జరిమానా విధించారు. ఆ మొత్తాన్ని ఎస్‌బీఐలో డీడీ తీసి కారును రిలీజ్ చేసుకోవడానికి పాత తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఉన్న ఎస్ఈబీ కార్యాలయానికి వచ్చాడు. డీడీ ఇచ్చినా కారు రిలీజ్ చేయటానికి ఎస్ఈబీ సీసీ ఎస్‌డీ ఫరూఖ్ అహ్మద్ రూ.7 వేలు లంచం డిమాండ్ చేశాడు. లంచం ఇవ్వడం ఇష్టంలేని కుమార్ ఏసీబీని ఆశ్రయించాడు. అతడి నుంచి మంగళవారం ఫరూఖ్ డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి బుధవారం నెల్లూరు ఏసీబీ కోర్టుకు ఫరూఖ్ అహ్మద్‌ను పంపిస్తున్నట్లు డీఎస్పీ చెప్పారు. ఈ దాడుల్లో సీఐలు టీవీ శ్రీనివాసరావు, ఎన్ఎస్ అపర్ణ, సీహెచ్ శేషు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం



వినతిపత్రం అందజేస్తున్న నేతలు

నెల్లూరు(వేదాయపాళెం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్మికులకు అందించి వారికి అండగా ఉంటామని కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లోని కార్మిక సంక్షేమ శాఖ కార్యాలయంలో మంగళవారం వివిధ కార్మిక సంఘాల నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్ దృష్టికి సంఘాల నేతలు తీసుకెళ్లారు. ఉప కమిషనర్ పీఎం, సీఎం, ఈ-శ్రమ పథకాల గురించి నేతలకు వివరించారు. అర్హత గల కార్మికులు వాటికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి కటారి అజయ్‌కుమార్, వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

భూమిపై సర్వహక్కులూ మీవే..

• అసైన్డ్ భూములకు శాశ్వత పట్టాలు పంపిణీ చేసిన నేదురుమల్లి



పట్టా అందజేస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం: అసైన్డ్ భూముల్లో సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్న పేద రైతులకు ఆ భూమిపై సర్వహక్కులూ కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం నేడు శాశ్వత పట్టాల పంపిణీకి శ్రీకారం చుట్టిందని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన సైదాపురంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ సైదాపురం మండలంలో 404 మంది రైతులకు 533 ఎకరాల అసైన్డ్ భూములపై సర్వహక్కులు కల్పిస్తున్నట్టు తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతు ముంగింటకే రాయితీలు వచ్చాయని, విత్తు నుంచి విక్రయం వరకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని గుర్తుచేశారు. సైదాపురం మండలంలో మూడు వేల ఎకరాల్లో సాగు చేసుకుంటున్న రైతులకు సంక్రాంతి కానుకగా పట్టాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రవికుమార్, సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు గోగినేని శివకుమార్, జేసీఎస్ కన్వీనర్ గుంటమడుగు శ్రీనివాసులరాజు, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ తిరకాల భాస్కర్, నేతలు రాఘవరెడ్డి, మాలకొండారెడ్డి, రామ్‌గోపాల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, దయాకర్‌రెడ్డి, మనోహర్, ప్రసాద్‌రాజు, విజయభాస్కర్, వీరాస్వామి, హరి, సైదాపురం సర్పంచ్ శారద తదితరులు పాల్గొన్నారు.

ట్యాబ్‌ల పంపిణీ రేపు

నెల్లూరు(టౌన్): జిల్లాలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు గురువారం ట్యాబ్‌లను అందజేయనున్నారు. ఇప్పటికే మండలాలకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. జిల్లాలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 19,052 మంది ఉన్నారు. తొలి విడతలో 10,503 మందికి ఇవ్వాలని నిర్ణయించారు. వాటిల్లో ఆయా తరగతికి చెందిన పాఠ్యాంశాలను అప్‌లోడ్ చేయనున్నారు. మిగిలిన వారికి మరో వారంరోజుల్లో ట్యాబ్‌లను పంపిణీ చేయనున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడ సెంటర్‌లో మంగళవారం ఓ వ్యక్తి చనిపోయి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న బుచ్చిరెడ్డిపాళెం పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతను కట్టుబడిపాళేనికి చెందిన నరసయ్య (52)గా గుర్తించారు. చేపల మార్కెట్‌లో పని చేస్తుంటాడని స్థానికులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మహేంద్ర తెలిపారు.